సాక్షి
జనగామ
మంగళవారం | 31 | జనవరి | 2023



కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కేనా?
కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాజెక్టులకు కేటాయించే నిధులపై సంశయం నెలకొంది.
- 8లో▸



మినీ జాతరకు సిద్ధం
మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు అధికారులు సిద్ధమయ్యారు. భక్తుల సౌకర్యార్థం ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 / 17^0

వాతావరణం
ఉదయం మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత అధికంగా ఉంటుంది.

సమస్యలు పరిష్కరించండి

- గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ
- వివిధ సమస్యలపై 55 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్, ఇతర అధికారులు

జనగామ రూరల్: 'నా కొడుకు, కోడలు ఇంట్లోకి రానివ్వడం లేదు.. కాళ్లరిగేలా తిరుగుతున్నా భూమి పట్టా చేయడంలేదు.. డబుల్ బెడ్రూం పంపిణీలో అన్యాయం జరిగింది.. కాజేసిన డ్వాక్రా డబ్బులు రికవరీ చేయడంలేదు'.. ఇలా పలు సమస్యలపై అర్జీలు సమర్పించిన ప్రజలు.. వాటిని పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 55 అర్జీలు రాగా.. అందులో ఆసరా పింఛన్, భూ సమస్యలవే అధికంగా ఉన్నాయి. రెవెన్యూ విభాగానికి 39, ఎస్సీ వెల్ఫేర్ 5, రూరల్ డెవలప్‌మెంట్ 4, ఏడీ సర్వేల్యాండ్ 3, సివిల్ సప్లయ్, హ్యాండ్లూం, మున్సిపల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు ఒకటి చొప్పున వచ్చాయి. వినతులను కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర అధికారులు స్వీకరించా రు. అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

భూమి కాజేయాలని చూస్తున్నరు..



నా భర్త సోమయ్య పేరు మీద 905 బీ2, 906ఏ సర్వే నంబర్లలో 2.16 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి చెందిన కొందరు నా భర్తకు మద్యం అలవాటు చేసి భూమిని అక్రమంగా వారి పేరున చేసుకోవడానికి స్లాట్ బుక్ చేసుకున్నారు. రెండు సార్లు ఇంటి మీదకు వచ్చి దాడికి పాల్పడగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. భూమి రిజిస్ట్రేషన్ నిలిపివేసి న్యాయం చేయాలని.. మంజుల కుటుంబ సభ్యులతో వచ్చి కలెక్టర్‌కు అర్జీ పెట్టుకుంది.

- దండు మంజుల, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల

భూమి పైసలు రాలేదు..

స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ శివారులోని 360 సర్వే నంబర్‌లో మాకు 22 ఎకరాల 2 గుంటల భూమి ఉంది. అందులో 1.20 గుంటలు కెనాల్ కింద పోయింది. మొత్తం 11 మంది రైతులు ఉంటే ముగ్గురికి మాత్రమే పరిహారం పైసలు వచ్చాయి. మిగతా ఎనిమిది మందికి రాలేదు.. న్యాయం చేయాలని బాధితుల్లోని ఎస్.రాజయ్య, జి.ఎల్లయ్య తదితరులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.





డబ్బులు రికవరీ చేయాలి

జనగామ మండలం వెంకిర్యాల డ్వాక్రా సంఘంలో అధికారులు, సీఏ, అకౌంటెంట్ ద్వారా కోటి రూపాయల అవినీతి జరిగింది. ఈ మేరకు గతంలో అధికారులు లెక్కలు తేల్చారు. డీఆర్‌డీఓ, సంబంధిత అధికారులు ఏడాది నుంచి కాలయాపన చేస్తున్నారు. 'అధికారులపై చర్య తీసుకుని డబ్బు రికవరీ చేయాలని' సంఘం సభ్యులు కోరారు.

కొడుకు, కోడలు వెళ్లగొట్టారు



బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన అచ్చిన యాదమ్మకు ఇద్దరు కొడుకులు. ఒక కుమారుడితోపాటు భర్త చనిపోయాడు. భర్త బీరుమల్లు ఉన్నప్పుడే కష్టపడి ఇల్లు కట్టుకున్నారు. ఆయన పేరుమీద ఎకరం భూమి కూడా ఉంది. 'మరో కుమారుడు, కోడలు నన్ను ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. గ్రామంలో తెలిసినవారి ఇళ్లలో తలదాచుకుంటున్నాను. ఇల్లు ఇప్పించి ఆదుకోవాలి' అంటూ యాదమ్మ కలెక్టర్‌ను వేడుకుంది.



'పక్క ఫొటోలోని మహిళ పేరు గోరంట శోభ. చిల్పూరు మండలం పల్లగుట్టకు చెందిన ఈమె భర్త కుమారస్వామి దివ్యాంగుడు. ఎలాంటి పని చేయలేడు. వీరికి ఇద్దరు కుమారులు. ఒక కొడుకు అనారోగ్యంతో మృతి చెందాడు. ఏ ఆధారమూ లేదు. తలదాచుకోవడానికి నీడ కూడా లేదు. కూలి పనులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. 'గ్రామంలో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక జాబితాలో ఉన్న తమ పేర్లను ఫైనల్ లిస్టులో తొలగించారు.. పలు మార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.. ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి' అని శోభ కలెక్టర్‌ను వేడుకుంది.'

వారసత్వ భూమిని ఆక్రమించారు



గ్రామంలోని 53.2 సర్వేనంబర్‌లో మా తండ్రి మేకపోతుల యాదగిరి పేరున 2.8 గుంటల భూమి ఉంది. వారసత్వంగా వస్తున్న ఈ భూమిలో కొంత మంది వ్యక్తులు ఎకరం స్థలం అక్రమంగా పట్టా చేసుకున్నారు. ఆ భూమిని నా పేరుమీద చేసి హద్దులు ఏర్పాటు చేయాలి.

- మేకపోతుల నర్సయ్య, సింగరాజుపల్లి, దేవరుప్పుల

భూమి పట్టా కోసం తిరుగుతున్నా..



గ్రామంలోని 504 సర్వేనంబర్‌లో నాకు ఎకరం 30 గుంటల భూమి ఉంది. తెలంగాణ పట్టా పాస్‌బుక్‌లో ఎకరం 10 గుంటల భూమి మాత్రమే నమోదైంది. మిగతా 20 గుంటల భూమి పట్టా చేయాలని కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా.. ఇప్పటి వరకు పనికాలేదు. సమస్య పరిష్కంచాలి.

- కాశిరెడ్డి సంజీవరెడ్డి, చిన్నరాంచర్ల బచ్చన్నపేట

న్యూస్‌రీల్

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

- డీసీపీ సీతారాం



నర్మెట: సీసీ కెమెరాలతో నేరాలకు చెక్ పెట్టడమే కాకుండా నేరగాళ్లను కనిపెట్టడం సులభతరం అవుతుందని డీసీపీ సీతారాం అన్నారు. మచ్చుపహాడ్‌లో సర్పంచ్ రామిని శివరాజ్, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను ఏసీపీ దేవేందర్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. అనుమానితులు, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐ పాటి నాగబాబు, ఎస్సై షేక్ జానీపాషా, హెచ్‌సీ గట్టయ్య, సిబ్బంది దనుంజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదాన్ని తరిమికొట్టి లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో తోట రమేష్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ మతోన్మాద భావజాలంతో పనిచేస్తూ పేదలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ.. వాటిలో పనిచేసే కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై రానున్న రోజుల్లో బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి సీపీఐ పోరాటం చేస్తుందని, ఎన్నికల్లో కలిసి వచ్చే శక్తులతో ముందుకు సాగుతామని తెలిపారు. కార్యక్రమంలో జనగామ, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు రాజారెడ్డి, కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యురాలు సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆది సాయన్న, మంగళంపల్లి జనార్దన్, జువారి రమేష్, కావాటి యాదగిరి, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్న విగ్రహ నిర్మాణ గద్దె కూల్చడం అమానుషం



స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధి నమిలిగొండ శివారులో బహుజన వీరుడు, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణం కోసం కేజీకేఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గద్దెను రెవెన్యూ అధికారులు కూల్చి వేయించడం అమానుషమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి వెంకటస్వామి అన్నారు. నమిలిగొండ శివారులో నిరుపేదలు వేసుకున్న గుడిసెలు, కేజీకేఎస్ గద్దెను కూల్చివేసిన ప్రాంతాన్ని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ తక్షణమే గద్దెను నిర్మించి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు కేజీకేఎస్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 23 ఏళ్ల క్రితం నిరుపేదలకు పట్టాలు ఇచ్చిన అధికారులు, పాలకులు వారికి స్థలాలు చూపించలేదని, వారికి స్థలాలు చూపించి అర్హులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోకినపల్లి చక్రపాణి, నీరటి అభిలాష్, రంజిత్, రాకేష్, అజయ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ రిజిస్ట్రార్ కొనసాగింపు

మెరిట్ కమ్ సీనియారిటీతో అన్యాయం

డివిజన్ సాధనకు నిరంతర ఉద్యమం

- వివరాలు 10లో▸

అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి



గోపాల్‌నగర్ జీపీ భూమిపూజలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

బచ్చన్నపేట: పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధి గోపాల్‌నగర్, బోనకొల్లూర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనాలకు, కొడ్వటూర్ సిద్దులగుట్ట వద్ద అర్చకుల నూతన గృహనిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఆలయ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ విడుదల చేశారు. కేశిరెడ్డిపల్లిలో పార్టీ గద్దెను ప్రారంభించి జెండా ఆవిష్కరించారు. రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ రమణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, ఎంపీపీ నాగజ్యోతి, సర్పంచ్‌లు పి.మధుప్రసాద్, సతీష్‌రెడ్డి, ఐలుమల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం సర్టిఫికెట్లు, మిషన్లు పంపిణీ చేశారు. శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్ రీజియన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వి.సునీత, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ డాక్టర్ శ్యామల్ జాన్, అసిస్టెంట్ కమిషనర్ కె.ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కుమారస్వామి, సీనియర్ ఫ్యాకల్టీ ప్రసాద్, జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీటీసీ రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ అడుగుజాడల్లో నడవాలి



జనగామ: నివాళులర్పిస్తున్న జంగా, తదితరులు



నివాళులర్పిస్తున్న పొన్నాల వర్గీయులు

జనగామ: అహింసా పరమోధర్మ అన్న బాపూజీ అడుగుజాడల్లో యువత పయనించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రం స్వర్ణకళామందిర్ జంక్షన్‌లోని గాంధీ విగ్రహానికి రాఘవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్లు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ లక్ష్మీనారాయణ, నాయకులు ఎర్రమల్ల సుధాకర్, సత్యనారాయణరెడ్డి, చెంచారపు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. అలాగే టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ మాసాన్‌పల్లి లింగాజీ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర, మహేందర్ రెడ్డి, ఉడత రవి యాదవ్ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇదిలా ఉండగా.. నర్మెట మండల కేంద్రం యాదవ కాలనీలో జంగా రాఘవరెడ్డి గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

ఫిబ్రవరిలో పోడు భూములకు పట్టాలు

- పారదర్శకంగా టీచర్ల బదిలీలు, పదోన్నతులు
- 'కంటి వెలుగు' శిబిరాలను పర్యవేక్షించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు, సీఎస్

జనగామ: పోడు వ్యవసాయం చేస్తున్న అర్హులైన గిరిజన, గిరిజనేతర రైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పోడు భూములు, కంటి వెలుగు, మనఊరు-మనబడి, టీచర్ల బదిలీలు, ఆయిల్‌పామ్ అంశాలపై సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోడు సమస్య పరిష్కారానికి సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, పట్టాల పంపిణీ అనంతరం ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ అర్హులకు పోడు పట్టాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంటి వెలుగు శిబిరాలను క్వాలిటీ కంట్రోల్ బృందాలు సందర్శించాలని, వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు గ్రీవెన్స్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేకంగా మెడికల్ బోర్డు, సదరం క్యాంపు నిర్వహించాలని పేర్కొన్నారు. 'మనఊరు-మనబడి' కింద అన్ని హంగులతో సిద్ధం చేసిన పాఠశాలలను ఫిబ్రవరి 1న ప్రారంభించాలని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వీసీలో కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ, ఖాళీల జాబితా ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి కేసులను పరిశీలించినట్లు వివరించారు. కౌన్సెలింగ్‌కు ముందస్తు అవకాశం కల్పించాలని టీచర్లు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని సీఎస్ దృష్టికి తీసుకెళ్లగా.. విద్యాశాఖ కార్యదర్శి అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తారని పేర్కొన్నారు. వీసీలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేందర్, డీఈఓ కె.రాము, ఎఫ్‌ఆర్‌ఓ కొండల్‌రెడ్డి, డీఏఓ వినోద్‌కుమార్, హార్టికల్చర్ అధికారి కేఆర్.లత, ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారి వసంత, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డీఓ కృష్ణవేణి, కలెక్టరేట్ ఏఓ మన్సూరి పాల్గొన్నారు.



వీసీలో కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

అసమ్మతి కౌన్సిలర్లతో చర్చలు..?

- నేడు పార్టీ ముఖ్యనేత రంగంలోకి..
- సభ్యులు కలెక్టరేట్‌కు వచ్చే అవకాశం
- అవిశ్వాసం వైపే మొగ్గు..!
- కాంగ్రెస్ కౌన్సిలర్లతో మంతనాలు..?

జనగామ: ఆరు రోజుల బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల క్యాంపు రాజకీయాలు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, ఫ్లోర్ లీడర్‌లను తొలగించాలనే డిమాండ్‌తో భువనగిరి రిస్టార్టు శిబిరంలో ఉన్న 11 మంది అసమ్మతి సభ్యులు.. అక్కడి నుంచి మకాంమార్చి మూడు రోజుల క్రితం మేడారం, మల్లూరు పుణ్యక్షేత్రాల్లో దర్శనం తర్వాత ఆ సరిహద్దుల్లో ఉన్నారు. అయితే.. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, ఫ్లోర్‌లీడర్ వ్యవహారంపై అసమ్మతి సభ్యులు ఎమ్మెల్యే పేరుతో ఆయన పంపిన దూత సురేష్ రెడ్డికి లేఖ రాయడంతోపాటు తమ డిమాండ్లను ముందుంచారు. దీంతో ఎలాగైనా అవిశ్వాసం, రాజీనామాలు లేకుండా చేయాలనే పట్టుదలతో అధిష్టానం ఉంది. క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు చర్చలకు అంగీకరించగా.. మంగళవారం(నేడు) హనుమకొండలో ముఖ్యనేతతో సమావేశం అవుతారని తెలిసింది. ఇందుకు రహస్య ప్రదేశం ఎంపిక చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

చర్చల్లో తేలే ఫలితాలను బట్టి నిర్ణయం..

చర్చలు సఫలం కాని పక్షంలో.. ఇప్పటి వరకు రాజీనామా ఆలోచనలో ఉన్న సభ్యులు.. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతారనే సంకేతాలు వస్తున్నాయి. అక్కడి నుంచి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకుని.. అవిశ్వాసం నోటీసులు ఇస్తారని సమాచారం. అయితే సమస్యకు అక్కడే చెక్ పెట్టాలనే నిర్ణయంతో పార్టీ ఉన్నట్లు తెలిసింది.

ప్రతిపక్ష సభ్యుల మద్దతు ఉండేనా..!

మున్సిపాలిటీలో 30 మంది కౌన్సిలర్లు ఉండగా.. కాంగ్రెస్ నుంచి చేరిన వారితోపాటు స్వతంత్రులను కలుపుకుని బీఆర్‌ఎస్‌కు 18 మంది అయ్యారు. ఇందులో 11 మంది క్యాంపులో ఉండగా.. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో కలుపుకుని ఏడుగురు సభ్యులు బయట ఉన్నారు. ఇందులో ఒకరిద్దరి మద్దతు కోసం అసమ్మతి సభ్యులు సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. మూడో వంతు మెజార్టీ ఉంటేనే అవిశ్వాసానికి అవకాశం ఉండడంతో.. అవసరమైతే కాంగ్రెస్, బీజేపీకి చెందిన కౌన్సిలర్ల మద్దతు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష సభ్యులు సైతం అవిశ్వాసం వైపే ఉన్నట్లు సమాచారం. అవకాశం వస్తే.. చైర్‌పర్సన్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లు ఆ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు 'సాక్షి'కి చెప్పారు.

జర్నలిజం.. ఉన్నతమైన వృత్తి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య
- 'కంటి వెలుగు' ప్రత్యేక శిబిరం ప్రారంభం

జనగామ: జర్నలిజం.. ఉన్నతమైన వృత్తి అని.. ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటూ రేపటి సమాజం కోసం పని చేస్తున్న పాత్రికేయుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ శివలింగయ్య అన్నారు. జిల్లాలోని పాత్రికేయులకు కలెక్టరేట్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో సోమవారం ప్రత్యేకంగా 'కంటి వెలుగు' శిబిరాలు ఏర్పాటు చేశారు. జనగామలో ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజలతోపాటు పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన అద్దాలు, మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 26 బృందాల ద్వారా కంటి పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. పాత్రికేయులు ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ.. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌తోపాటు జర్నలిస్టులకు వైద్యులు కంటి పరీక్షలు చేసి అవసరమున్న వారికి కలెక్టర్ చేతుల మీదుగా రీడింగ్ అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేందర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, జర్నలిస్టులు పాల్గొన్నారు.



'కంటి వెలుగు' శిబిరంలో జర్నలిస్టులతో కలెక్టర్

వావిలాలలో ప్రాచీన దేవాలయాలు

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి

పాలకుర్తి: మండల పరిధి వావిలాల గ్రామంలో ప్రాచీన దేవాలయాలు, ఆది మానవుల అవశేషాలు ఉన్నట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎంతో చరిత్ర కలిగిన వావిలాల గ్రామంలోని జిల్లా చెరువు దగ్గర ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం శిథిలమైందని చెప్పారు. ద్వార పాలకులుగా హనుమంతుడు, గరుత్మంతుడి విగ్రహాలు ఉన్నాయని, ఇవి జీడికల్, వల్మిడి రామాలయంలోని విగ్రహాలను పోలి ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా చెరువు ముందు ప్రధాన రహదారిలో ఉన్న ప్రాచీన శివాలయం రెండు భాగాలు అయిందని, ఇందులో నాగ దేవతల విగ్రహాలున్నాయని పేర్కొన్నారు. ఏక వీరుడి శిల్పం కూడా ఉందని, వీటిని పరిశీలిస్తే చాళుక్యుల నాటి నిర్మాణంగా తెలుస్తున్నదని అన్నారు. ఇదిలా ఉండగా.. బీరప్ప ఆలయం ముందు ఉన్న పెద్ద బండపై నవీన శిలాయుగం నాటి గుర్తులు ఉన్నాయని ఆయన వివరించారు.



వావిలాల గ్రామంలోని ఆలయం, అందులోని విగ్రహాలను పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

టీచర్ల ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగింపు

- రేపటి వరకు అవకాశం, అదే రోజు ఎడిట్ ఆప్షన్
- ఇప్పటి వరకు 940 దరఖాస్తులు
- ఫిబ్రవరి 11న ఫైనల్ జాబితా

జనగామ: టీచర్ల బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 30 వరకు చివరి అవకాశం ఉండగా.. ఫిబ్రవరి ఒకటి వరకు పొడిగించింది. అదే రోజు దరఖాస్తుల్లో తప్పొప్పులు సరిచేసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 940 దరఖాస్తులు వచ్చాయి.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఇలా..

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కాగానే ధ్రువీకరణ పత్రాలను ఎంఈఓ లేదా డ్రాయింగ్(స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం)లకు అందించాల్సి ఉంటుంది. ఒరిజినల్ రికార్డుల ఆధారంగా ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి డీఈఓకు నివేదిస్తారు. ఆయన క్రాస్ చెక్ చేసి అప్రూవల్ చేస్తారు. అనంతరం ఎన్‌టైటిల్‌మెంట్‌కు సంబంధించి పాయింట్లు కేటాయిస్తారు. వాటి ఆధారంగా సీనియార్టీ జాబితా తయారు చేస్తారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 9న పరిశీలన, 11న ఫైనల్ జాబితా ప్రకటిస్తారు. ఇందులో పొందుపరిచిన సీనియార్టీ ప్రకారం టీచర్లు వెబ్‌ఆప్షన్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. అనంతరం అలాట్ మెంటు జరుగుతుంది.

ఒకేచోట పనిచేయడానికి అవకాశమివ్వాలి

317 జీఓ అమలుతో దంపతులు(టీచర్లు) వేర్వేరు పాఠశాలలకు వెళ్లాల్సి వచ్చింది. దీనిపై పెద్ద ఎత్తున వచ్చిన నిరసనల నేపథ్యంలో సీఎం ఆదేశాల మేరకు ఒకేచోట పనిచేసేలా యుద్ధప్రాతిపదికన బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నియామకం పొంది కొన్నేళ్లుగా భార్యాభర్తలు వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి కౌన్సెలింగ్‌లో స్పౌజ్ పాయింట్లు ఇవ్వడం లేదు. అయితే భార్యాభర్తలు ఒకే చోట పని చేసేందుకు అవకాశం కల్పించాలని జిల్లాలోని స్పౌజ్ ఉపాధ్యాయులు సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నారు.



జఫర్‌గఢ్: దరఖాస్తు ఇస్తున్న ఉపాధ్యాయుడు సురేష్

క్లుప్తంగా

వీసీ, మాజీ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్‌పై కేసు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య బి.వెంకట్రామ్‌రెడ్డితోసహా ఫైనాన్స్ ఆఫీసర్ టి.రాజయ్యలపై కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో జిల్లాకోర్టు ఆదేశాల మేరకు వారిపైన 418, 425, 405, 406, 408,409 సెక్షన్లకింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ సోమవారం తెలిపారు. యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు జరిగాయి. అందులో అవకతవకలు జరిగాయని అప్పట్లోనే ఆరోపణలు వచ్చిన విషయం విధితమే. వారితో కుమ్మక్కై, వారిని ఉద్యోగంలో కొనసాగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలను కూడా చెల్లిస్తున్నారని తమప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని డాక్టర్ వినీత నాయిని జిల్లాకోర్టులో గత ఏడాది సెప్టెంబర్‌లో కేసు వేశారు. దీంతో జిల్లా కోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 28న పోలీసులు వీసీ, మాజీ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని సిరిపురంలో కుక్కల దాడిలో బండ మహేందర్‌కు చెందిన 16 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రోజువారీగా గొర్రెలను దొడ్లో తోలి మహేందర్ ఇంటికి వెళ్లాడు. రాత్రి కుక్కలు దొడ్లోకి చొరబడి గొర్రెలపై దాడి చేయగా 16 గొర్రెలు చనిపోవడంతోపాటు మరికొన్ని గాయపడి ఉన్నాయి. ఉదయం మహేందర్ వెళ్లి చూసేసరికి కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందినట్లు గుర్తించాడు. గాయాలైన గొర్రెలను మండల పశువైద్యాధికారి అనిత పరిశీలించి, వైద్యసేవలు అందించారు. గొర్రెల పెంపకంతోనే జీవనోపాధి పొందే మహేందర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


శ్రీను (ఫైల్)

పెద్దవంగర: కడుపు నొప్పి తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎస్కే రియాజ్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల పరిధిలోని రామచంద్రు దండాకు చెందిన లకావత్ శ్రీను (38) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం పలుమార్లు ఆస్పత్రులు తిరిగినా కడుపు నొప్పి తగ్గకపోవడంతో మనస్థాపానికి లోనై ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనుకు భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి బాల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులకు తండావాసి జాటోతు శ్రీనివాస్ రూ.5 వేలు ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందజేశాడు.

గుర్తుతెలియని వ్యక్తి..

కమలాపూర్: కమలాపూర్ మండలంలోని ఉప్పల్–జమ్మికుంట రైల్వే స్టేషన్ల మధ్య ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు మంచిర్యాల జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందని, మృతుడి వద్ద ఎలాంటి అడ్రస్, ఆధారాలు లేవని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు చుక్కల షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మెడకు నల్లని దారం, ఆంజనేయుని బొమ్మగల మెటల్ లాకెట్, కుడి చేతికి తెలుపు రంగు ఉంగరం, కుడి చేతిపై ఏ అనే పచ్చబొట్టు ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు. ఈ సమాచారాన్ని మృతుడి బంధువులకు చేరే వరకు వాట్సాప్ గ్రూపుల్లో పంపించాలని, పూర్తి వివరాలకు 83285 12176, 94409 00792 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కేనా!

గత బడ్జెట్‌లలో కేటాయింపులు తక్కువే..

- కలగానే కాజీపేట డివిజన్..
- పెండింగ్‌లో కాజీపేట–సికింద్రాబాద్ మూడోలైన్
- ఈసారి బడ్జెట్‌పై ప్రజల ఆశలు



సాక్షి ప్రతినిధి, వరంగల్: కేంద్ర బడ్జెట్ కోసం ప్రతీసారి చేస్తున్న ప్రతిపాదనలకు మోక్షం లభించకపోవడంతో కీలకమైన ప్రాజెక్టుల పనులు పట్టాలెక్కడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఎంపీల ప్రతిపాదనలకు ఫలితం ఉంటుందా.. అనే చర్చ జరుగుతోంది. రేపు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే పెద్ద పద్దులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏమేరకు వాటా ఉంటుందనే సంశయం నెలకొంది. మూడు బడ్జెట్‌ల సమయంలో ప్రతిపాదనలు చేసినా.. కాళేశ్వరానికి జాతీయ హోదా దక్కకపోగా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్, పీఓహెచ్ షెడ్‌కు స్థల కేటాయింపు, కొత్త రైల్వేలైన్ల ప్రతిపాదనలు, సర్వేలు కాగితాలకే పరిమితమయ్యాయి. 2023–24 బడ్జెట్‌లోనైనా సరిపడా నిధులు కేటాయిస్తారని ఓరుగల్లు వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెండింగ్‌లో కీలక ప్రాజెక్టులు

పెండింగ్ రైల్వే లైన్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు ఇవ్వలేదు. కాజీపేట మీదుగా బల్లార్షా– విజయవాడ మూడో లైన్ నిర్మాణ పనులు మాత్రమే జరుగుతుండగా, కాజీపేట డివిజన్ కేంద్రం ఏర్పాటు, బల్లార్షా– కాజీపేట ఫోర్త్ లైన్ నిర్మాణం పెండింగ్‌లో ఉన్నాయి. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు మూడో రైల్వేలైన్ సర్వే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. కాజీపేట– హసన్‌పర్తి –హుజూరాబాద్ – కరీంనగర్ కొత్త రైల్వేలైన్.. సర్వే ప్రతిపాదనలు దాటలేదు. కొత్తగూడెం, మణుగూరు నుంచి తాడ్వాయి అడవుల మీదుగా రామగుండం, భూపాలపల్లికి రెండు మార్గాల్లో సర్వే కోసం గతంలో బడ్జెట్‌లో ప్రతిపాదనలు రాగా ప్రైవేటు సంస్థతో సర్వేతో సరిపెట్టారు. కాగా, మన ఎంపీలు పలుమార్లు చేసిన ప్రతిపాదనలు కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావనకు నోచుకోలేదు. గ్రేటర్ వరంగల్‌కు 2016మే నాలుగో వారంలో సప్లమెంటరీ పోటీల్లో 'స్మార్ట్‌సిటీ'లో చోటు లభించింది. ఈ పథకంలో రూ.2వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులను ప్రతిపాదించారు. 2021–22 బడ్జెట్‌లో రూ.160 కోట్లు కేటాయించి విడుదల చేయగా, 2022–23 బడ్జెట్‌లో ప్రత్యేకంగా పేర్కొన లేదు. హృదయ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం గత ఆరేళ్ల కిందట కేటాయించిన రూ.40 కోట్లతో వివిధ పనులు చేపట్టగా, గత బడ్జెట్‌లో ఇచ్చిందేమీ లేదు. గ్రేటర్ వరంగల్, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా)లకు వాటా దక్కలేదు.

పీఓహెచ్‌కు రూ.900 కోట్ల అంచనా..

పిరియాడికల్ ఓవర్‌హాలింగ్ షెడ్ (పీఓహెచ్) కాజీపేట అయోధ్యపురంలో నిర్మించేందుకు కేంద్రం రూ.900 కోట్లతో అంచనా వేసింది. వ్యాగన్ రిపేర్ షెడ్ల నిర్మాణానికి ఎకరంన్నర స్థల సమస్య కారణంగా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. పీఓహెచ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని దేవాదాయశాఖ నుంచి సేకరించి కేంద్రానికి అప్పగించగా, ముఖద్వారం వద్ద ఉన్న ఎకరంన్నర భూమి సేకరణలో జాప్యం పనులకు అడ్డంకిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థల పూర్తి చేస్తే కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది. గత బడ్జెట్‌లో కాజీపేట రైల్వేస్టేషన్‌లో రెండు అదనపు ఫ్లాట్‌ఫారాల మంజూరు చేసినట్లు ప్రకటించినా నేటికీ ఆ పనుల్లో కదలిక లేదు. కాగా కరోనా సమయంలో డోర్నకల్, గార్ల, మహబూబాబాద్, కేసముద్రం, నెక్కొండ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలన్న డిమాండ్ ఉంది. పాండురంగాపురం భద్రాచలం రైల్వే లైన్లను ప్రారంభించి, రైల్వే బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి నిధులు అడిగాం..



గిరిజనులు ఆదివాసీలు ఎక్కువగా ఉన్న మానుకోట పార్లమెంట్ పరిధి అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరాను. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించి ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నాం. మా పార్లమెంటు పరిధిలోని ప్రతి జిల్లాలో ఏకలవ్య స్కూల్ ఏర్పాటు చేయాలి.

– మాలోతు కవిత, ఎంపీ, మహబూబాబాద్

ప్రతిపాదనలు పంపించాను..



కేంద్ర బడ్జెట్ సందర్భంగా పలు ప్రతిపాదనలు చేశాం. గిరిజన యూనివర్సిటీతో పాటు నవో దయ, కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని అడిగా. కాజీపేట డివిజన్, పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమ, రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిధులు కావాలి. కాజీపేట నుంచి తిరుపతికి, షిర్డీకి కొత్త రైళ్లను వేయాలని కోరాం.

– పసునూరి దయాకర్, ఎంపీ, వరంగల్

కీలక ప్రతిపాదనలు చేశా..



ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు చేశాను. కాజీపేట– హసన్‌పర్తి – హుజూరాబాద్ – కరీంనగర్ మార్గం ఏర్పాటు విషయమై విన్నవించా. ఈ బడ్జెట్‌లోనూ రైల్వే ప్రాజెక్టుల పరంగా మంచి నిర్ణయాలుంటాయని భావిస్తున్నా.

– బండి సంజయ్, ఎంపీ, కరీంనగర్

పోక్సో కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ గిరికుమార్

ఖిలా వరంగల్: మాయమాటలతో నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లి బాలికపై సామూహిక అత్యాచారం చేసి పరారీలోఉన్న ముగ్గురు యువకులను పోక్సో కేసులో సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ కల్కోట్ల గిరికుమార్ తెలిపారు. సోమవారం వరంగల్ మట్టెవాడ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ వివరాలు వెల్లడించారు. కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ 16ఏళ్ల బాలికకు ఓ స్నేహితురాలి ద్వారా నర్సంపేటలోని మాధన్నపేట గ్రామానికి చెందిన దూడల ప్రభాస్(19) పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో ఆ బాలికకు దగ్గరై లైంగిక దాడికి ఒడిగడుతున్నాడు. ఈక్రమంలో బాలికను ఈనెల 24న ఇంటి నుంచి బయటకు రప్పించి బైక్‌పై దూపకుంట రోడ్డులోని నిర్జీవ ప్రదేశానికి దూడల ప్రభాస్ తీసుకెళ్లాడు. అతని స్నేహితులు సమీప బంధువులు పడమరకోట ఎస్సీ కాలనీకి చెందిన గద్దల భరత్(22), అదే ప్రాంతానికి చెందిన మైదం అవినాష్ ఆలియాస్ బన్నీ(19)లు కలిసి బాలికపై అత్యాచారానికి పాల్పడుతారు. ఆతర్వాత బాలికను మాధన్నపేటలోని తన ఇంటికి తీసుకెళ్లి అక్కడి నుంచి నేరుగా కాశిబుగ్గలోని తన ఇంటి వద్ద వదిలేశాడు. జరిగిన ఘటనపై ఈనెల 25వ తేదీ బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో తల్లి సహకారంతో బాధిత బాలిక ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు కామాంధులు దూడల ప్రభాస్, గద్దల భరత్, మైదం అవినాష్ ఆలియాస్ బన్నిలను సోమవారం ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ వద్ద అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరచగా జడ్జీ ఆదేశాల మేరకు ఖమ్మం జైలుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

ఐదుగురిపై చీటింగ్ కేసు నమోదు

ఖిలా వరంగల్: వాహనానికి నంబర్ ప్లేట్స్, ట్యాంపరింగ్, నంబర్ ప్లేట్ మీద స్టిక్కర్ వేసి తిరుగుతున్న ఐదురుగు వాహనచోదకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. ఈమేరకు సోమవారం వరంగల్ శంభునిపేటలోని గవిచర్ల క్రాస్ రోడ్డుపై ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో ఎస్సై రాజబాబు, ఆర్ఎస్సైలు పూర్ణచందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో టేకు శ్రీకాంత్, కందిక సురేష్, మార్త మాధవ్, ముప్ప చరణ్ నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారి వాహనాలను సీజ్ చేసి, వారిపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో 420 చీటింగ్ కేసు నమోదు చేయించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


ఖిలా వరంగల్: తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

కాజీపేట: కాజీపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష, 8 మందికి రూ.14వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి విద్యాసాగర్ రావు తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. గుమ్మడి భద్రయ్య, మంద తిరుపతి, రావుల నీలాధర్, మాచర్ల రాజేందర్‌లకు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.


మొదటి మ్యాచ్ విజేత సీడీసీ జట్టు


రెండో మ్యాచ్ విజేత వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ

రసవత్తరంగా సాక్షి ప్రీమియర్ లీగ్

- క్రికెట్ పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సాగిన క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, డీహెచ్‌రావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. పోటీలకు ఎల్బీ కళాశాల మైదానం వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు.

- మూడో రోజు మొదటి మ్యాచ్‌లో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ– నేతాజీ ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. చైతన్య యూనివర్సిటీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. నేతాజీ ఫార్మసీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 66 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చైతన్య యూనివర్సిటీ జట్టు 7.3 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. ఈ మ్యాచ్‌లో నిఖిల్ 40 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా నిలిచాడు.
- రెండో మ్యాచ్‌లో ఎల్బీ కళాశాల– సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెయింట్ పీటర్స్ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 54 పరుగులు సాధించింది. ఎల్బీ కళాశాల జట్టు 3.4 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించి అదరహో అనిపించింది. ఈ మ్యాచ్‌లో హరిప్రసాద్ 23 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా నిలిచాడు.
- మూడో మ్యాచ్‌లో వాగ్దేవి కళాశాల– అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన వాగ్దేవి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 157 పరుగులు సాధించింది. ఆయుర్వేద కళాశాల జట్టు 10 ఓవర్లలో 40 పరుగులు మాత్రమే సాధించగలిగింది. దీంతో వాగ్దేవి జట్టు 117 పరుగుల భారీ తేడాతో విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో వాగ్దేవి కళాశాలకు చెందిన అబ్దుల్ వాసీ 63 పరుగులతో మైదానంలో మెరుపులు మెరిపించాడు.
- నాల్గో మ్యాచ్‌లో జయముఖి కళాశాల, శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జయముఖి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 141 పరుగులు సాధించింది. అరుణోదయ జట్టు 5 ఓవర్లలో 44 పరుగుకే ఆల్ అవుట్ అయింది. దీంతో జయముఖి కళాశాల 103 పరుగులతో భారీ విజయాన్ని సాధించింది.


మూడో మ్యాచ్ విజేత ఎల్బీ కాలేజీ జట్టు


నాల్గో మ్యాచ్ విజేత జయముఖి కాలేజీ జట్టు



మేడారంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు, జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసి డ్రెస్సింగ్ గదులు, ట్యాప్స్, గద్దెల ప్రాంగణంలో సీసీ కెమెరా

మినీ జాతరకు సిద్ధం

మేడారంలో ఏర్పాట్లు పూర్తి

- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- విధుల నిర్వహణకు అధికారుల సన్నద్ధం

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ మినీజాతరకు అధికారులు సిద్ధమయ్యారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం ఆయా శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి మినీజాతర (మండమెలిగె) ఉత్సవాలు ప్రారంభయ్యే నేపథ్యంలో జాతరలో విధుల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సంసిద్ధులవుతున్నారు. ఈ జాతరకు లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా మేరకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. జాతరకు ఒకే రోజు మాత్రమే గడువు ఉంది.

పూర్తయిన ఏర్పాట్లు..

మినీజాతరలో భక్తుల సౌకర్యార్థం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో మేడారంలో 600 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం సోమవారం నాటికి పూర్తయింది. జాతరలో భక్తుల మల,మూత్ర విసర్జన కోసం సులబ్ కాంప్లెక్స్ మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు వద్ద శాశ్వతంగా నిర్మించిన మూడు డ్రెసింగ్ గదుల్లో ఎలక్ట్రీషియన్ పనులన్నీ పూర్తయ్యాయి. జంపన్నవాగు వద్ద జల్లు స్నానాలకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌లకు కనెక్షన్ ఏర్పాటు చేశారు పోలీసు శాఖ ఆధ్వర్యంలో భక్తుల వాహనాలు మళ్లించేందుకు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు.


అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్లు

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటిని భక్తులకు అందించేందుకు భక్తులు విడిది చేసే ప్రదేశాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేసి వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటి కనెక్షన్ అందించారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మేడారంలో భక్తులకు అందించే సౌకర్యాలకు వారికి తెలిసే విధంగా మేడారంలోని ప్రధాన దారుల వెంట ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు క్యూలో భక్తులు అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా, ఈఓ రాజేంద్రం దేవాదాయ శాఖ పనులన్నీ పూర్తయ్యాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మవార్లను దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత మేడారంలో పర్యటించి ఆ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన పనులను పరిశీలించారు. సులభ్ కాంప్లెక్స్ మరమ్మతులు, జంపన్నవాగు వద్ద డ్రెస్సింగ్ గదుల్లో ఎలక్ట్రీషియన్ పనులను పరిశీలించారు. నేటి నుంచి తమ శాఖ తరపున చేపట్టిన సౌకర్యాలన్నీ భక్తులకు అందుబాటులోకి తీసురానున్నట్లు తెలిపారు.

భక్తుల మొక్కులు

సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించి పుట్టు వెంట్రుకలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. అమ్మవార్ల పసుపు, కుంకుమ, ఒడి బియ్యం ఎత్తు బంగారం సమర్పించారు. మొక్కుల అనంతరం మేడారం పరిసరాల్లో సేదతీరి వంట వార్పు చేసుకున్నారు.


అమ్మవార్లకు ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రోడ్డుపై పడిన కరెన్సీ

- జనం నుంచి రికవరీ చేసిన పోలీసులు
- వర్ధన్నపేటలో వింత ఘటన


డబ్బులు లభించిన వ్యక్తి

వర్ధన్నపేట: ద్విచక్ర వాహనం నుంచి పొరపాటున రోడ్డుపై పడిపోయిన కరెన్సీని దొరికినవి దొరికినట్లుగా ఏరుకుని తీసుకున్న వారి సమాచారం కనుగొని పోలీసులు వారి నుంచి రీకవరీ చేసిన ఘటన సోమవారం సాయంత్రం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం ఖమ్మం వైపు నుంచి వరంగల్ వైపునకు వెళుతున్న ఓ ద్విచక్రవాహనంపై ఓ జంట ప్రయాణిస్తుండగా వర్ధన్నపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఓ కవరులోంచి రూ.500 నోట్లు కింద పడ్డాయి. ఆ విషయాన్ని వారు గమణించలేదు. కింద పడ్డ నోట్లను కొందరు ఏరుకోగా ఓ వ్యక్తికి రూ.6,500, మరో వ్యక్తికి రూ.2,000, మరో గుర్తు తెలియని వ్యక్తికి రూ.3,000 వేలు లభించాయి. ఈ విషయం సోషల్‌మీడియాలో ప్రచారం కావడం పోలీసులకు సమాచారం అందడంతో వారు డబ్బులను తీసుకున్న వారిని గుర్తించి రాత్రి వారి నుంచి రూ.7వేలు రికవరీ చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. మిగతా డబ్బులు తీసుకున్న వ్యక్తి బీహార్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఉన్నట్లుగా సమాచారం ఉందన్నారు. వ్యక్తి దొరకలేదని వివరించారు.

నిలిచిఉన్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టిన మరో బస్సు

- నలుగురు ప్రయాణికులకు గాయాలు


గాయపడిన రాజేశ్వరి, వివేక్

రఘునాథపల్లి: నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండ నుంచి తిరిగి వస్తూ మండల కేంద్రంలో సర్వీస్‌రోడ్డులోని రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద ప్రయాణికుల కోసం నిలిచిఉంది. అదే సమయంలో హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనకాల వస్తూ నిలిచి ఉన్న బస్సును ఢీ కొట్టింది. దీంతో ముందు ఉన్న బస్సు అద్దాలు పగిలి వెనకాల కూర్చున్న మంగళిబండతండాకు చెందిన సునావత్ వివేక్, జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన రాజేశ్వరితో పాటు మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని గాయపడినవారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన హనుమకొండ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ గుగులోతు రాములుపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

వరంగల్ క్రైం: ఐనవోలు దేవాలయం పరిసర ప్రాంతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగతో పాటు, ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులను ఐనవోలు పోలీసులు సోమవారం అరెస్ట్ చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. నిందితుల నుంచి 40 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.80 లక్షల నగదు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి ప్రాంతానికి చెందిన నిందితుడు ఎల్లబోయిన హరీష్ ఈనెల 21న యాదాద్రి జిల్లా బీబీనగర్ ప్రాంతానికి చెందిన గండు వసంత మొక్కులు చెల్లించుకునేందుకు ఐనవోలు జాతరలోని ఎల్లమ్మ గుడి వద్ద బోనం ఎత్తుకొనే సమయంలో సదరు మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును చోరీ చేశాడు. ఈ చోరీ పై బాధితులరాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఐనవోలు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జాతరలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి కాశిబుగ్గ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు చైన్ స్నాచింగ్ చేసిన అనంతరం వంచనగిరి చెందిన మరో నిందితుడు శోభోతు భిక్షపతి సూచన మేరకు అతనితో కలిసి బంగారు పుస్తెల తాడుని నెక్కొండ మండలం అలంకారిపేట గ్రామానికి చెందిన బోయినపల్లి సూర్యప్రకాశ్‌కి విక్రయించగా.. ఇందుకుగాను నిందితులకు రూ.2.06 లక్షలు ఇచ్చాడు. ఇందులో ప్రధాన నిందితుడు హరీశ్ రూ.1.80 ఉంచుకోగా మిగతా ఇరవై వేలను మరో నిందితుడు భిక్షపతికి ఇచ్చినట్లు ప్రధాన నిందితుడు అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. నిందితుడి సమాచారం మేరకు మిగతా ఇద్దరు నిందితుల వద్ద నుంచి చోరీ సొత్తుతో పాటు నగదు, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏసీపీ నరేష్‌కుమార్, పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై వెంకన్న, సిబ్బందిని డీసీపీ అభినందించారు.